ఆదివారం

ప్రజాశక్తి

ఏప్రిల్ 27, 2003



భారతీయ సినిమా తొలి వెలుగు

దాదాసాహెబ్ ఫాల్కే

హ్యాపీ బర్త్‌డే

(27-4-200
3-5-2003వర

ఎస్ఆర్.నిఖిత
1సం॥, ఏప్రిల్-2002
భాగ్యలక్ష్మి-యాదగిరి
అడ్డగుట్ట- సికింద్రాబాద్

పవన్‌కుమార్
2సం॥, 27.4.2001
సంతనవతి-కృష్ణ
ఆమదాలవలస-శ్రీకాకుళం

హర్షవర్ధిని
2సం॥, 29.4.2001
అంజనమ్మ-ఆంజనేయులు
చౌటుబట్ల-మహబూబ్ నగర్

షేక్ రోష్నీ
1సం॥, ఏప్రిల్-2002
మున్నీ-చాంద్
మొగల్రాజపురం-విజయవాడ

శ్రీరమణి
1సం॥, 29.4.2002
విజయ-అజయ్‌కుమార్
కాకినాడ - తూ.గో

వనం శ్రీలక్ష్మి
3సం॥,ఏప్రిల్-2000
జయలలిత-నాగరాజ్
గాంధీనగర్-బళ్ళారి

కామిరెడ్డి భానుతేజ
2సం॥, ఏప్రిల్. 2001
కోడూరు- నెల్లూరు

ఆర్.వైష్ణవి
3॥సం, ఏప్రిల్-2000
సువర్ణ-శ్రీనివాసరావు
లాయర్‌పేట-ఒంగోలు

పఠాన్ పర్వీనా
5సం॥, 29.4.1998
మహబూబీ-మహ్మద్‌ఖాన్
మొగల్రాజపురం-విజయవాడ

డి.హేమసాయి
2సం॥30.4.2001
చిట్టి-సుబ్రమణ్యం
మాధవ్‌నగర్-తిరుపతి

పూజారి హర్షవర్ధిని
ఏప్రిల్-30
అంజలి-బాలాజీప్రసాద్
కెపిపి ఉడా కాలని-విజయనగరం

ఎమ్. సంపత్‌రెడ్డి
2సం॥, ఏప్రిల్-2001
భాగ్యలక్ష్మి-కంచం రెడ్డి
రాయచోటి- కడప

వి.సింధూజా
6సం॥,ఏప్రిల్-1997
చంద్రకళ-శోభన్‌బాబు
తొత్తుకుంట-సికింద్రాబాద్

బి.అమూల్యరెడ్డి
8సం॥, ఏప్రిల్-1995
విజయభారతి-తిరుపతిరెడ్డి
అనుబోలు-నెల్లూరు

పి.అరుణజ్యోతి
5సం॥,1.5.1998
ఎల్లమ్మ-వెంకన్న
చెర్వుఅన్నారం-నల్లగొండ

అరువు సొమ్ము బరువు చేటు



*** రాంప్రసాద్. ఎం.కె.**

అరువు సొమ్ము బరువు చేటనేది ఆర్యోక్తి. ఇది అన్ని రంగాలకు వర్తిస్తుంది. క్రీడలకు కూడా వర్తిస్తుందని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. తీసుకున్నప్పుడు బాగానే ఉండవచ్చుగానీ తరువాత వస్తుంది అసలు ఇబ్బంది. 32వ జాతీయ క్రీడలకు హైదరాబాద్‌ను వేదికగా నిర్ణయించగానే మన రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విచిత్రమైన ఆలోచన కలిగింది. వీటిని ప్రభుత్వ పేరుప్రతిష్టలను పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇందులో తప్పుపట్టాల్సినదేమీ లేదు. అయితే అందుకు అనుసరించిన పద్ధతే విచిత్రంగా ఉంది.

ఇతర రాష్ట్రాలకు చెందిన అథ్లెట్లకు ప్రోత్సాహకాలు ఆశపెట్టి రాష్ట్రం తరపున పోటీల్లో నిలబెట్టారు. ఇందువల్ల రాష్ట్రం అగ్రభాగాన నిలబడుతుందని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వం ఆలోచనను వెంటనే ఆచరణలో పెట్టారు. కోరుకున్న



ఉదయలక్ష్మి

విధంగానే రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. అయితే అప్పటివరకూ బాగానే ఉంది. సమస్య తాజాగా వెలికివచ్చింది. 22 మంది అథ్లెట్లు డోపింగ్ టెస్టులో పట్టుబడినట్లు వార్తలు రావడంతో అందరూ ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందారు. ఈ పట్టుబడిన వారు మన రాష్ట్రానికి చెందిన వారు కూడా ఉండటం బాధాకరం. ఈ క్రీడోత్సవాలు ఎటువంటి లోపాలకు ఆస్కారం లేకుండా జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో నిజం ఎంతో డోపింగ్ పరీక్ష బయటపెట్టింది. డోపింగ్‌లో చిక్కిన వారిపై చర్య తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే ఆలపాటి కళ్యాణిని రెండు మాసాలపాటు నిషేధం విధించారు. రాష్ట్రానికే చెందిన మరో అథ్లెట్ ఉదయలక్ష్మిపై చర్యను వాయిదా వేశారు. ఆమెపై కూడా నిషేధం వేటు వేయడం దాదాపు ఖాయమైపోయిందని వార్తలు వచ్చాయి. ఇంతలో ఉదయలక్ష్మి ఒక టివి ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చి సంచలనాత్మక ప్రకటన చేసింది. డ్రగ్స్ తీసుకోవాలని అధికారులు, క్రీడా ఫెడరేషన్లే తమపై ఒత్తిడి తీసుకువచ్చాయని ఆమె పేర్కొంది. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రభుత్వంపై అనేక విమర్శలు చేసింది. ఏమైనా పతకాలు తేవడమే ముఖ్యమని అధికారులు తమకు సూచించారని, డోపింగ్ టెస్ట్ గురించి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారని ఆమె తెలిపింది. డోపింగ్ వ్యవహారం వెలుగులోకి రాగానే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అథ్లెట్లకు ప్రకటించిన ప్రోత్సాహకాలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. దీనిపై తాను పోరాటం చేస్తానని ఉదయలక్ష్మి పేర్కొంది. ప్రోత్సాహకాలను వెనక్కు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని ఆమె పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను వెంటనే ఖండించింది. ఆమె చేసిన ఆరోపణలపై దర్యాప్తునకు ఆదేశించింది. ఇందులో నిజానిజాలు వెలుగు చూసే అవకాశం లేదు. ఏదిఏమైనా జాతీయ క్రీడలను తన పేరు ప్రతిష్టలను పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలని ఆశించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుచూడని విధంగా ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. ఒక్కసారిగా ప్రభుత్వం ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది. తన వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయని ఆమె చెపుతోంది. జాతీయ క్రీడల విజేతలకు ప్రభుత్వం ప్రకటించిన నగదు పురస్కారాలు ఇంకా చెల్లించలేదని వార్తలు వచ్చాయి. బడ్జెట్ విడుదల కాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. జాతీయ క్రీడల్లో రాష్ట్రం మొత్తం 242 పతకాలు పొంది అగ్రస్థానం పొందింది. ఇందులో 93 స్వర్ణ పతకాలున్నాయి. రాష్ట్రానికి వచ్చిన పతకాల్లో 107 అరువు తెచ్చుకున్న క్రీడాకారులు సంపాదించిపెట్టినవే. ఇందులో 49 స్వర్ణ పతకాలు కూడా ఉన్నాయి. ఈ అరువు పతకాలే కనుక లేకపోతే రాష్ట్రానికి మూడో స్థానం మాత్రమే దక్కి ఉండేది. డ్రగ్స్ కుంభకోణంలో పట్టుబడిన అథ్లెట్ల పతకాలను రద్దు చేస్తే రాష్ట్రం ఐదో స్థానానికి దిగజారుతుంది. స్వర్ణ పతకానికి మూడు, రజత పతకానికి రెండు, కాంస్య పతకానికి లక్ష రూపాయల నగదు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇంతకుముందు ప్రకటించింది. ఈ నగదు పురస్కారాలను పోటీలు జరిగి నాలుగు మాసాలైనా చెల్లించకపోవడం విమర్శలకు తావిస్తోంది. డోపింగ్ టెస్టులో చిక్కిన అథ్లెట్లు ఈ నెల 30న తమ ముందు హాజరుకావాలని భారత ఒలింపిక్ కమిషన్ మెడికల్ కమిషన్ తాఖీదు జారీ చేసింది. వారు తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇది సమర్థనీయమైన చర్య. చివరిగా ఒకమాట. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలేగానీ ఇలా క్రీడాకారులను అరువుకు తెచ్చి పోటీల్లో పాల్గొనేలా చేయడం మంచిది కాదని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. అలాగే ప్రకటించిన ప్రోత్సాహకాలను కూడా సరిగా చెల్లించడం లేదని ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌లో జరిగిన సిరీస్‌లో డబుల్ సెంచరీ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన తనకు రైల్వేస్ మొండిచెయ్యి చూపినట్టు మిథాలీ రాజ్ ఇటీవల పేర్కొంది. తనకు ఇస్తానని ప్రకటించిన ప్రమోషన్ ఇవ్వలేదని ఆమె తెలిపింది. ఇటువంటి చర్యలు క్రీడల అభివృద్ధికి దోహదం చేస్తాయా? ◆



జప్తు

* మొలకలపల్లి కోటేశ్వరరావు

"ఒక్క వారం రోజులు గడువు ఇయ్యండీ! ఇయ్యేటికి సగం అయినా ఎక్కడోచోట తంటాలు పడి తీసకొచ్చి జమ చేస్తాను!'' సుబ్బయ్య అన్నాడు వేడుకుంటున్నట్టుగా

"ఎన్నిసార్లు చెప్పావు నువ్వీమాట? ఎక్కడ తీసుకొస్తావు?" మేనేజర్ లక్ష్మణరావు అన్నాడు కోపంగా.

"ఎక్కడో చోట తంటాలు పడతానండీ! తల తాకట్టు అయినా పెట్టి తెచ్చి కడతాను?"

"నీ తలని తాకట్టు పెట్టుకునే తలకి మాసినోడు ఎవడయ్యా? ఈ సొల్లు మాటలూ, పనికిమాలిన మాటలూ మాకు చెప్పమాకు సుబ్బయ్యా! ఆ తెచ్చేదేదో ఇప్పుడే తీసకరా! మేం ఇక్కడ గంటసేపు కూచుంటాం! నువ్వు ఎలాగైనా తంటాలు పడు మూడువేలు జమ వేయి, ఇయ్యేటికి ఇంక అడగం!"

"ఇప్పటికి ఇప్పుడు వచ్చి గొంతుమీద కూచుంటే ఎట్టండీ? ఇప్పుడు రమ్మంటే డబ్బులు ఎక్కడ్నుంచి వస్తయ్యా! అయ్యేం చిల్ల పెంకులా?"

"మేం ఇప్పుడు అడుగుతున్నాం కొత్తగా? రెండు నెల్లనించీ మా సెక్రటరీ నీ ఇంటిచుట్టూ తిరిగినోడు తిరిగినట్టు వున్నాడు. అసలు మేం బాకీ అడిగేదేమిటి? తీసుకున్న వాడికి తీర్చాలని తెలియదా? కొత్తగా అడిగినట్టు మాట్టాడతన్నావే! నీకు ఇప్పుడు రెండుసార్లు నోటీసులు ఇచ్చాం. పది రోజుల నాడు అడిగితే నువ్వేమన్నావ్? వారం రోజుల్లో కడతానని చెప్పావు. చెప్పిన మాటమీద నిలబడాల్సిన పని లేదా? ఇప్పుడు నీకు తెల్సిందీ మాకు బాకీ ఇయ్యాలనీ... ఇంతకుముందు తెలియదూ?" మేనేజర్ పెద్ద కంఠంతో తెచ్చిపెట్టుకున్న కోపంతో అన్నాడు.

"నిన్న కూడా అడిగాను కదా సుబ్బయ్యా.. ఈసారి మా బేంకు వాళ్ళు వస్తే వూరుకోరూ, ఎక్కడోచోట తంటాలు పడి తీసకొచ్చి కట్టమనీ..." పెయిడ్ సెక్రటరీ అన్నాడు.

"ఎక్కడా పుట్టుదల కావా... లేకపోతే మీ బాకీ వుంచుకోవాలని నాకు బెమా? బాకీ తీరిస్తే నాకూ ఒక బరువుపోయిద్ది కదా!"

"ఆహా... ఏం మాటలు సుబ్బయ్యా! పాపం నీకు తీర్చాలనే వుంది కానీ వల్ల కాలా! ఎప్పటి బాకీ, ఎప్పటి ఎవారం? నీవు బాకీ తీసుకుని ఎన్నేళ్ళయింది? నాలుగేళ్ళ నించీ నీకు బాకీ తీర్చాలనే వుంది కానీ వల్లకాలా! లక్షలు కాదూ, కోట్లు కాదూ... నాలుగు వేలు! అప్పుడు ఒక వెయ్యి, అప్పుడు ఒక వెయ్యా జమ చేసినా ఈపాటికి బాకీ అనే మాటే లేకుండా వుండేదే!"

మేనేజర్ మాటలకి న మాట్లాడలేకపోయాడు. వంచిన తల ఎత్తలేదు.

"మీ ఒక్క బాకీ కాదు సామీ! మూడే నించీ పొలంలో దండగే తప్ప లాభం కనపడలా రూపాయి పొలానికి పెడతంటే పావలా చేతికి వస్తంది. ఊళ్ళో కూడా బాకీలు తేలాం. ముక్కుకీ, చెవులకీ వున్న కూసింత బంగారం కూడా కుదువ కట్టులోనే వుంది. దానికి గడువు కూడా తీరిపోయింది. ఆ ఇక ఆ సొమ్ము మాకు గాకుండా పోయింది. మీ ఒక్క బాకీ అయితే కూలిమీద అయినా తీర్చే వాళ్ళమి! ఇంక వారం రోజులు గడువు ఇయ్యండి, ఎక్కడైనా తెచ్చికొంత కడతాం. నా మాట నమ్మండి!" సుబ్బయ్య భార్య అంజమ్మ దీనంగా అడిగింది.

"ఈ మాటలు ఏం లాభం లేదమ్మా! మేం ఇలాంటి కేసులు చాలా చూశాం! ఇంట్లో వుండే చెంబూ, కంచం, తపళా బయటపడేసి తలుపు తాళం వేసి జప్తు చేస్తే కానీ మీరు బాకీ కట్టరు. మాకు తెలియని ఎవారమా? మీకు భయమూ, భక్తీ వుంటే మా బాకీ తీర్చకుండా ఇన్ని రోజులు అట్టిపెడతారూ? వీళ్ళేం చేస్తార్లే అనే ధీమా వుండబట్టేగా ఈనాటికి కూడా రూపాయి జమ చేయకుండా వుందీ! నిన్నా మొన్నా బాకీ కాదు. నిరుడూ, ముందటేడూ బాకీ కాదు. నాలుగేళ్ళ నాడు ఆసలు నాలుగు వేలు తీసుకున్నారు. మీకు బాకీ కట్టాలని వుంటే ఎప్పుడు కడితే తీరిపోదూ!"

"తీర్చాలనే సామీ... యెసులు బాటు కాలేదు. మేం ఎగేసే వాళ్ళమి కాదూ, ఒకరి సొమ్ము కోసం పుట్టినోళ్ళం కాదూ, ఒకరి సొమ్ము తేరగా వస్తే తిందామనుకునే వాళ్ళం కూడా కాదు సామీ! మా రాత ఇట్ట రాసుంది! బూదేవి తల్లిని నమ్ముకుంటే ఆ తల్లి అన్నేయం చేసింది. ఈ ఒక్కసారికీ నా మాట నమ్మండి!" అంజమ్మ అంది.

"లాభం లేదమ్మా! మేం నమ్ముతాం కానీ మా పైవాళ్ళు నమ్మరుగా! వసూళ్ళు సరిగా చేయకపోతే మా ఉజ్జోగాలు కూడా వూడిపోయేటట్టూ వున్నాయి. ఏం అనుకోవద్దు కానీ ఎక్కడ్కైనా వెళ్ళి మూడేలు తీసుకొచ్చి కట్టండి. ఇయ్యేటికి ఇంక అడగం! మేం వెళ్ళిపోతాం! కట్టడమా, లేకపోతే కుండా చట్టీ బయటపడేసి జప్తు చేయటమా? రెండే మార్గాలు! మీ ఇష్టం. మీరు కడతామంటే మాకేం బాధలేదు!" మేనేజర్ చిన్నగానే అయినా కఠినంగా, స్పష్టంగా అన్నాడు.

సుబ్బయ్యా, అంజమ్మా దిక్కు తోచక దీనంగా చూడటం మొదలుపెట్టారు.

ఒక్కొక్కరే వస్తూ నెమ్మదిగా జీపు చుట్టూ, ఇంటి ముందూ చాలా మంది జనం చేరారు. వాళ్ళు చోద్యంగా, వింతగా చూస్తున్నారు.

సుబ్బయ్య చాలా చిన్న రైతు. రెండెకరాలు పొలం వుంది.

నాలుగేళ్ళ క్రితం పొలానికి పెట్టుబడి అవసరమై వూళ్ళో వున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో పొలం తనఖా పెట్టి నాలుగువేలు

...న్నాడు.

అప్పటి నుంచీ ఆ పొలంలో దండగే తప్ప ...యి ఆదాయం లేదు.

మొదటి ఏడు వానలు ఎక్కువై నీళ్ళు నిలబడి పంట ఉరక దెబ్బతిని పోయింది. రెండో ఏడు పురుగు పడి పంటను నాశనం చేసింది. మూడో ఏడు వర్షాలు సమృద్ధిగా వుండీ, పంట సక్రమంగా పండీ, ఆ పండిన పంటకి మార్కెట్ లేక పెట్టిన పెట్టుబడి సైతం రాలేదు. ఈ ఏడాది వానలేలేవు. పెట్టిన విత్తనాలే రాలేదు. కరువు. వరుసగా నాలుగేళ్ళు నాలుగు రకాలుగా దెబ్బతిని వ్యవసాయంలో చితికిపోయాడు సుబ్బయ్య. బాకీ పడిపోయాడు.

సొసైటీలోనే గాకుండా వూళ్లో కూడా చాలా మందివద్ద అప్పులు చేశాడు. వడ్డీలు పెరిగాయి.

పొలం తక్కువ. అందులోనూ ఆదాయం లేకపోగా దండుగల పాలయ్యాడు.

దుబారా మనిషి కాదు. చెడుఖర్చులు లేవు. కడుపుకు తిన్నా ఖర్చవుతుందని నోరు కట్టేసుకునే రకం అయినా అప్పుల పాలయ్యాడు.

"నువ్వు అట్ట నిలువుకాళ్ళ మీద ఎంతసేపు కూచున్నా లాభం లేదు సుబ్బయ్యా! నిన్ను మొత్తం కట్టమనడంలా! వారం రోజుల్లో మాబాకీ కడతానంటున్నావు కదా! ఈ వారం రోజులకి ఎక్కువ వడ్డీ ఇస్తానని బయటవాళ్ళ దగ్గరికి వెళ్ళి తీసుకొచ్చి ఇప్పుడు మాకు కట్టు! వెళ్ళిపోతాం. నువ్వు జమ చేయనిది మాత్రం కదిలే పనిలేదు!"

"పుట్టుదల వుంటే మీరు ఇన్నిసార్లు అడగాలా సామీ! నేను ఒక్కడ్నే కాదు, చాలా మంది రైతులు దివాళా ఎత్తిపోయారు. అందరి రైతుల పనీ అట్నే వుంది. లేకపోతే ఎవురోకరి దగ్గర చేబదులు అయినా తీసకొచ్చి కట్టకపోయానా?"

ఇంకలాభం లేదులే! మాకు ఏదో పట్టినట్టు వుంది కానీ నీకు చీమకుట్టినట్టు లేదు. నిన్ను బతిమాడాల్సిన వని మాకేమొచ్చింది? కానియ్యండయ్యా! ఇంటో వుండ సామాను మొత్తం బయటపడేయండి. జీపులో వేసుకుని పోదాం! బేంకి దగ్గరకొచ్చి కట్టి విడిపించుకుపోతాడు!" మేనేజర్ సిబ్బందిని ఆదేశించాడు.

"ఒక్క వారం రోజులు గడువు ఇయ్యమంటున్నాడు కదా! ఇప్పటిదాకా వున్న వాళ్ళు ఇంక ఒక్క వారం రోజులు వుండండి!" వచ్చిన వాళ్ళలో పెద్ద మనిషిగా వున్న ఒకతను అడిగాడు.

"మీరు బయటి వాళ్ళు మాట్లాడకూడదండీ! మీకు సంబంధం లేదు. మీకు అంత బాధగా వుంటే మీరు డబ్బు తీసుకొచ్చి కట్టండి. మీరే తరువాత వసూలు చేసుకోండి! మేం ఇంక ఒక్కమాట మాట్లాడకుండా వెళ్ళిపోతాం!"

"మీరు మరీ ఇంతగా వత్తిడి చేస్తే ఎలాగండీ?" మరో అతను అన్నాడు.

"మమ్మల్ని పైన షంటుతున్నారు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి? మీరు ఎన్ని వూళ్ళు తిరిగారూ, ఎంతమందిని అడిగారూ, ఎన్ని బాకీలు వసూలు చేసారూ, ఎన్ని మొండి బకాయిలు రాబట్టారూ అని ఏ రోజు రిపోర్టు ఆ రోజు పైకి పంపించాలి. వసూళ్ళు చేయడం చేతకాకపోతే వుజ్జోగాలు మానుకుని ఇళ్ళకి పొండంటున్నారు. మాకు జీతాలు ఇవ్వడం దండగ అనే మాట కూడా అంటున్నారు. ఇంతకుముందు మాదిరిగా లేదు ఇప్పుడు. రూల్స్, అన్నీ మారిపోయినయ్యి!" మేనేజర్ అడిగిన వాళ్ళకి అడిగినట్టుగా చెబుతున్నాడు.

"బలవంతపు వసూళ్ళు వుండవని ముఖ్యమంత్రి కూడా పేపర్‌లో ఇచ్చాడు కదండీ?"

"మాటలకీ, చేతలకీ చాలా తేడా వుండిద్ది బాబూ! ఇయ్యాల మేము వణుకుతూనే వుజ్జోగాలు చేస్తున్నాం! లాభాలు లేకపోతే బేంకిని మూసిపారెయ్యమంటున్నారు. అయినా మేము తీసుకున్న బాకీదే అడుగుతున్నాం కానీ లేని బాకీ కాదుకదా! ఇంతమంది వున్నారు... ఒక్కొక్కరు వెయ్యి లెక్కన



ముగ్గురు మూడేలు ఇచ్చినా సరిపోతుంది. ఇయ్యేటికి ఇంక అడగం!"

వచ్చిన వాళ్ళు ఒక్కో మాట అంటున్నారు. తెచ్చి వాడుకున్నప్పుడు తీర్చాలని తెలియదా అని కొంతమంది సుబ్బయ్యని దూషిస్తున్నారు. మరీ ఇంత ఒత్తిడి చేస్తే ఎలా అని కొంతమంది బేంకు వాళ్ళని నిందిస్తున్నారు.

అంజమ్మ బతిమలాడి, విసుగుపుట్టి ఒకవైపు కూర్చుని ఏడుస్తోంది బిగ్గరగా.

సుబ్బయ్య కూడా ఏడుస్తున్నాడు.

"చూస్తారేం? మీ పని చేయండి. ఇంట్లో సామాను బయట పడేయండి ముందు!" మేనేజర్ కోపంగా సిబ్బందిని మరో మారు ఆదేశించాడు.

"సిబ్బంది లోపలికి జొరబడి ఇంట్లో వున్న మంచాలూ, కంచాలు, గిన్నెలూ, పెట్టేబేడా బయటకు తీసుకువచ్చి పెట్టారు.

ఇంతలో హడావుడిగా గుంపుని చీల్చుకుని పేరయ్య అనే ఆయన వచ్చాడు. ఆయనకి విషయం తెలిసి ఇంటిదగ్గర నుంచి పరిగెత్తుకుని వచ్చాడు.

"ఏం పనండీ ఇదీ? ఎంత ఒకవేళ మీకు బాకీ వున్నా మనం మర్యాద వున్న వాళ్ళు చేసే పనేనా ఇది? పరువుగా బతుకుతున్న కుటుంబాన్ని బజారున పడెయ్యటం మీకు సబబేనా? ఈయన రైతు అనుకున్నారా, లేకపోతే మీకు దొంగ మాదిరిగా కనబడుతున్నాడా?" అని పెద్దపెద్దగా అరవడం మొదలు పెట్టాడు.

"మా డ్యూటీని మేం చేస్తున్నాం. మీరు ఎక్కువగా మాట్లాడితే ప్రభుత్వ ఉద్యోగి విధుల్ని ఆటంకపరిచారని మీ మీద కేసు పెట్టాల్సి ఉంటుంది!"

"పెట్టుకోండి కేసు. మీ కేసులకి ఇక్కడ భయపడేవాళ్ళు ఎవరూ లేరు. ఎంతనోట్లో నాలిక లేని వాడయినా ఇంటిమీద పడి సామాను తీసుకుపోతారూ? మీకు ఏమిటో లక్షలూ కోట్లూ బాకీ వున్నట్లు దౌర్జన్యం చేస్తారేమిటి?"

"లక్షలూ కోట్లూ కాదు, పది రూపాయల బాకీ వున్నాడు మాకు. అది చాలదూ? మీకు అంత అభిమానం సాగిపోతంటే మీరే కట్టండి బాకీ! మేం మాట్లాడితే అప్పుడు అడగండి!"

"ఏం అంత మాత్రం బాకీ కట్టలేననుకున్నారా? ముందు మీ బాకీ ఎంతో చెప్పండి. ఐదు నిముషాల్లో పైసల్తో మీ బాకీ తీర్చేస్తా!"

"వద్దులే పేరయ్యా... ఇంక ఇంతకంటే ఏం చేస్తార్లే? ఆ సామానే తీసకపోనియ్యి. సామాను పోగా వాళ్ళకి ఇంకా బాకీ తేలితే నన్ను జైల్లో పెట్టమను. ఇంత ఎవారం జరిగిన తరువాత వాళ్ళకి ఇంక బాకీ కట్టేదేమిటీ? పోయిన పరువేదో పోయిందిలే!" అన్నాడు సుబ్బయ్య.

"నువ్వూరుకోరా సుబ్బయ్యా...ఎంత నామర్దా పని ఇది? చెప్పండి మీ బాకీ ఎంతో?"

"మాకు ఇప్పుడు బాకీ మొత్తాన్ని కట్టాల్సిన పని లేదు. మూడు వేలు జమ వేస్తే చాలు!"

"మళ్ళీ మీతో ఇంకో కొలువెందుకు? బాకీ మొత్తం కడతా! ఎంతో చెప్పండి. ఇక ఈ జన్మలో మీరు ఈ గడప తొక్కకూడదు!"

"వద్దులే పేరయ్యా! నువ్వు మాత్రం కడితే వూరుకోను. జరిగేదేదో జరగనివ్వు!" అంటున్నాడు సుబ్బయ్య.

అతని మాటని చెవిన పెట్టలేదు.

"నువ్వూరు కోరా... బాకీ చూడు!" అన్నాడు పేరయ్య మేనేజర్‌తో.

"ఆయన కడతానంటే నీకేంరా? కట్టనివ్వు ముందు, తర్వాత విషయం తరవాత!" అని వచ్చిన జనం సుబ్బయ్యని నోరు ఎత్తనివ్వలేదు.

మేనేజర్ లెక్క చూసాడు.

"మొత్తం ఎనిమిదివేలా ఆరువందల యాభై అయిందండీ బాకీ!"

పేరయ్య ఇంటికి వెళ్ళి ఐదు నిముషాల్లోపే డబ్బు మొత్తం తీసుకొచ్చి చెల్లించాడు.

(మిగతా 23వ పేజీలో)

హిందూ-ముస్లిం భాయిభాయి!!

'కాబా కాశీ కా మిలన్' అన్న కథల పుస్తకంలో మొదటి కథలో దివ్య అనే కూతురు తల్లితో "అమ్మా! మేం నీ పిల్లలం. మా కోసం ఈ త్యాగం చెయ్యి. డాడిని క్షమించమ్మా! డాడీ ఏమైనా సెకండ్ ఫ్యామిలీ మెయింటెయిన్ చేస్తున్నారా?" అని అంటుంది. ఈ కథ ఏమిటంటే - తండ్రి, వాళ్ళింట్లో పని చేసే భర్త లేని పనిమనిషితో ఓ రోజు మధ్యాహ్నం వాళ్ళ పడకగదిలో గడుపుతాడు. భార్య నిలదీస్తే 'ఆమే నన్ను బలవంతంగా అందులోకి దింపింది" అని నేరాన్ని వాళ్ల పని మనిషి మీదకి తోసేస్తాడు. ఈ విషయం పిల్లలకు తెలిసి, 'దివ్య'పై మాటల్ని తల్లితో అంటుంది. కుటుంబ పరువు కోసం, పిల్లల భద్రత కోసం ఒక మహిళ, పురుషుడి వైవాహికేతర సంబంధాల్ని చూసీ చూడనట్టుగా ఉండాలని ఈతరం పిల్లలు కోరుకుంటున్నారని రచయిత్రి కనుపర్తి విజయలక్ష్మి ఎత్తి చూపించారు. కానీ ఈనాటి తల్లి చిన్నప్పుడు ఎన్నో చూసింది. అమె అమ్మ.. ..ద్ద.. నీరజక్క. ఇవాళ తాను అందరి కథలు "పాత కథ"లే! కానీ ఆనాడు తన తల్లికి ఇలాంటి సలహా ఇవ్వకుండా తండ్రిని వదిలేయమని చెప్పింది. కానీ ఈ రోజు తన కూతురు దివ్యమాత్రం అవన్నీ సహించమంటుంది. కథ ముగింపులో "తను పిల్లల కోసం జీవిస్తుంది. కానీ అతడ్ని భర్తగా అంగీకరించనవసరం లేదు" అనుకుంటుంది.



'కాబా కాశీకా మిలన్'
(కథల సంపుటి)
రచన: డా॥ కనుపర్తి విజయబక్ష్
వెల : 40/-
ప్రతులకు : డా॥ కనుపర్తి విజయలక్ష్మి, సిద్ధార్థ హైస్కూలు, మండపేట, తూ.గో.జిల్లా.

ఇలాంటి మొత్తం 24 కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను రచయిత్రి తనదైన పద్ధతిలో ఈ కథల్లో విశ్లేషించారు. ఎందుకంటే రచయిత్రికి "స్త్రీలకు ఎడతెగక జరుగుతున్న అన్యాయాలను ఏదో విధంగా చెప్పాలనే తాపత్రయం" ఉంది. ఆమెకు తెలిసిన వారు... కలిసిన వారు... ఆమె పొందిన అనుభవాల సారాన్నే కథలుగా మన ముందుంచారు. ఈ సంపుటిలో "మగపశువు"తో "సర్దుకుపో"వటం వంటి "పాతకథలు" చాలా వున్నాయి. "దీనికి పరిష్కారం ఏమిటి?" అనే కథలో ఓ ప్రశ్న ఉంది. మధ్యతరగతి కుటుంబాల్లో కొందరు భర్తలు, భార్యల్ని కొట్టి హింసించినా, ఆ భార్యలు కుటుంబ మర్యాద కోసం ఎవరితో చెప్పుకోకుండా సర్దుకుపోవాల్సి వస్తుంది. అలాంటి భర్తలకి శిక్ష ఎలా పడుతుంది? "సర్దుకుపో" అనే కథలో తన జీవితం ప్రశాంతంగా గడవాలంటే జీవితాంతం సర్దుకుపోవడం తప్పదనే వాస్తవాన్ని ఒక స్త్రీ తెలుసుకుంటుంది. సర్దుకుపోవడం మంత్రజపంతోటే - గొప్పతల్లి, గొప్ప భార్య అన్న బిరుదులను మహిళలు పొందగలుగుతారు అంటూ వేదనను ఇమిడ్చి చెప్పిన కథ "సర్దుకుపో". చివరి కథ "కాబా కాశీ కా మిలన్"లో హిందూ-ముస్లిం భాయిభాయి అనే అంశాన్ని చెప్పారు.

ఈ కథలను 2001, 2002 సంవత్సరాల్లో రాయడం వల్ల కథలన్నింటిలోను సమకాలీన ఇతి వృత్తాలనే ఎన్నుకున్నారు. ఈ కథలు చాలా వరకు కొన్ని అభ్యుదయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

ముందుమాటలో అబ్బూరి ఛాయాదేవి అన్నట్లు రచయిత్రి కథాశిల్పం పట్ల శ్రద్ధ వహిస్తే ఆమె కథలు ఇంకా రాణిస్తాయి. కథను చెప్పడంలో మరింత క్లుప్తత సాధించాలని వాడ్రేవు వీరలక్ష్మి దేవి సలహా ఇవ్వడం కూడా సమంజసమే.

✻ కర్ర ఎల్లారెడ్డి

స్వీకారం



ధృవతారకలు-2 (గేయ సంకలనం)
రచన: ఎన్.ఆర్.కంఠంనేని
వెల : 5/- **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



నివేదన (ప్రథమ వచన కవితా సంపుటి)
రచన: బద్ది నాగేశ్వరరావు,
వెల : 10/- **ప్రతులకు :** బద్ది నాగేశ్వరరావు, 13-9-5, గోలి వీధి, దేముని గుమ్మ, అనకాపల్లి.



ఆఖరి ప్రారంభపు మజిలి
రచన: పి.రామచంద్రమూర్తి (రాంబాబు) **వెల :** 15/-
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లికేషన్స్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; పి.రామచంద్రమూర్తి, 'త్యాగరాజు కుటీర్', 7-13-4, సాయిబాబు మందిరం పక్క సందు, 3వ అడ్డరోడ్డు, లాయరు పేట, ఒంగోలు

...అర్థమైంది. ఆమె చిరునామా తెలుసుకున్నాడు. గోపాలపట్నంలో ...సుల సహకారం తీసుకున్నాడు. శశికళ తన వద్ద క్షేమంగా ఉన్నట్లు ...డపకు కబురు పంపాడు.

* * *

2003 మార్చి 10

గోపాలపట్నంలో కాళ్ళ వెంకటరావు ఇంటికి ఓ దంపతుల జంట వచ్చారు. తనే కడప వెంకటేశ్వర్లునని పరిచయం చేసుకున్నాడు.

లోపలి నుంచి శశికళ పరుగు పరుగున వచ్చింది. ఉబికి వస్తున్న కన్నీళ్ళను అదుపు చేయడం ఆమెకు సాధ్యం కావడం లేదు. ఏడుస్తూ భర్తను చుట్టుకుపోయింది.

మూడేళ్ళ తర్వాత భర్త వెంకటేశ్వర్లును కలుసుకున్న శశికళ

విడిపోయిన భార్యాభర్తల్ని కలిపి మానవత్వం చూపిన వెంకటరావు


ఏమైపోయిందో తెలియని భార్య ఆర్తిగా అల్లుకుపోవడంతో వెంకటేశ్వర్లు కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. మాటలు వారి మధ్య మౌన పోరాటం చేశాయి.

ఇంట్లో వారెవరూ వారి ప్రేమకు అడ్డుకట్టవేయలేదు. దూరమైన భార్యాభర్తల్ని కలిపామని వెంకకు ఆనంద బాష్పాలు.

"నువ్వు చనిపోయావను కున్నాను. ఎన్నెన్ని ప్రాంతాలు వెతికానో తెలీదు. నెలల బాబు గుక్కపట్టి ఏడుస్తుంటే వాడిని సముదాయించడం నా వల్ల అయ్యేది కాదు. వాడికి మరో అమ్మను ఇవ్వాలన్న ఆశతో నేను మళ్ళీ పెళ్ళి చేసుకున్నాను.. నన్ను క్షమించు శశికళా..." వెంకటేశ్వర్లు చెప్పుకుపోతున్నాడు.

కాళ్ళ వెంకటరావు, విశాలాక్షి దంపతులకు వెంకటేశ్వర్లుతో వచ్చిన అమ్మాయి ఎవరో అప్పుడు అర్థం అయింది. విధి ఆడే వింత నాటకం ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతి కలిగింది.

ఆ అమ్మాయి కూడా "అక్కా" అంటూ శశికళను అల్లుకుపోయింది.

"నువ్వు బతికి ఉన్నావన్న కబురు వినగానే ఆయన ఎంత ఆనందించారో తెలుసా... ఆయన సంతోషానికి నేను ఎప్పుడూ అడ్డు చెప్పను. వెంటనే ఇద్దరం బయలుదేరి వచ్చాము... నాది ఏ తప్పూ లేదక్కా..." ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది.

కొత్తగా పెళ్ళి చేసుకున్న భార్య... ఎప్పుడో చనిపోయిందని అనుకున్న భార్య తిరిగి రావడం... కలిగించిన ఆనందం వెంకటేశ్వర్లును వివశుడ్ని చేసింది. "ఇందులో ఎవరి తప్పూ లేదు... విధి విలాసం" అన్నాడు.

తర్వాత వారి ముగ్గురినీ వెంకటరావు దగ్గరుండి ట్రెయిన్ ఎక్కించాడు... "గుర్తుంచుకోండి" అంటూ పళ్లబుట్ట అందించాడు.

"అమృతాన్ని పంచి... ఆనందాన్నిచ్చిన అన్నయ్యకు మరిచిపోతానా..." అంటూ శశికళ చేయి ఊపింది. ఆమె చేతుల వెనుక కొత్త దంపతుల చేతులు కూడా టాటా చెప్పాయి. ట్రెయిన్ కదిలింది. ◆

జప్తు

(19వ పేజీ తరువాయి)

"నువ్వెందుకు కట్టావు పేరయ్యా! నా తంటాలు ఏవో నేను పడేవాడిని కదా!" అని సుబ్బయ్య నెత్తీ నోరు కొట్టుకుని బాధపడ్డాడు.

నాలుగైదు ఏళ్ళ నించీ పేరయ్యకీ, సుబ్బయ్యకీ మధ్యమాటల్లేవు. ఇద్దరూ అనేకసార్లు తగాదా పడ్డారు.

పేరయ్య అంటే సుబ్బయ్యకి చాలా కోపం. ఆయన అంటే మండిపడతాడు.

పేరయ్యకి పన్నెండు ఎకరాల పొలం వుంది. ఒక ట్రాక్టర్ వుంది. ట్రాక్టర్ మీదనే చాలా డబ్బు కూడా సంపాయించాడు.

పేరయ్యకి నాలుగు ఎకరాల పొలం ఒక చోట వుంటే దాని పక్కనే సుబ్బయ్య పొలం కూడా. ట్రాక్టర్‌తో ఎప్పుడూ సుబ్బయ్య చేను గట్టు దున్ని తన చేతో కలిపేవాడు. ఆ గట్టు దగ్గరే ఇద్దరికీ చాలాసార్లు తగాదా జరిగి కొట్టుకునేవరకూ పరిస్థితి వెళ్ళింది.

సుబ్బయ్యకి వున్న రెండు ఎకరాల పొలం ఎప్పటికైనా తన పొలంలో కలుపుకోవాలని పేరయ్యకి చాలా ఆశ.

"నాలుగేళ్ళ బట్టి నీకు పొలంలో దండగలె కదా! బాకీలు పడిపోయావు. పొలం అమ్మి బాకీలు తీర్చుకో! రోజురోజుకీ వడ్డీలు పెరుగుతాయి. కానీ తగ్గవు. ఆలస్యమైతే వడ్డీలు పెరిగి మొదటికే మోసం జరిగిద్ది! పొలం అమ్మే పనయితే నాకే అమ్ము. చేలో చేను కలుస్తుంది!" అని పేరయ్య చాలా మందితో సుబ్బయ్యకు కబురు చేశాడు.

సుబ్బయ్య తన బొందిలో ప్రాణం వుండగా పొలం అమ్మేపని జరగదని తేల్చి చెప్పాడు. అయినా పేరయ్య పేరాశ చావలేదు.

సుబ్బయ్య పొలంలో ఇంకా దండగలు పడి, ఇంకా బాకీల పాలుకావాలి. అలా అయితే కానీ అతను పొలం బేరానికి పెట్టడు. అప్పుడు ధర ఎక్కువో తక్కువో తనే కొని తన పొలంలో కలిపేసుకుంటాడు. ఇది పేరయ్య ఆలోచన.

నాలుగు రోజులు జరిగాయి. సుబ్బయ్య వాళ్ళ ఇంటికి వచ్చాడు పేరయ్య.

"ఏరా సుబ్బయ్యా... సొసైటీ వాళ్ళు ఎంతవని చేసార్రా! ఆ రోజు నేను డబ్బులు కట్టకపోయినట్లయితే పరువు పోయి వుండేదిరా! వాళ్ళ పీడ వదిలిపోయిందనుకో!"

"వాళ్ళ పీడపోతే నీ పీడ తగులుకోలా!" అనుకున్నారు సుబ్బయ్యా, అంజమ్మా.

"సరే, డబ్బు ఎవారం ఏం చేద్దాం? డబ్బు ఎక్కడైనా చూసి ఇస్తావా, నోటు రాసిస్తావా? నువ్వు డబ్బు ఇచ్చే పనయితే పర్లేదు. ఈ నాల్రోజులకీ వడ్డీ కూడా అడగను!"

"డబ్బులు ఎక్కడ దొరుకుతయ్యి? నోటు రాయించుకో!"

"నీ ఇష్టం. నాదేం లేదు. అయితే నోటు ఎప్పుడు రాసిస్తా?"

"మళ్ళీ తరువాత ఎందుకూ, ఇప్పుడే రాసిస్తా!"

"సరే అయితే! రామారావు పంతులు వాళ్ళింటికి పోదాం. ఆయన రాసిస్తాడు నోటు!" అన్నాడు పేరయ్య. ఇద్దరూ రామారావు వాళ్ళింటికి వెళ్ళారు.

"కొరవ డబ్బు కూడా తీసుకుని పదివేలకి నోటు రాసియ్యి. వైనంగా వుండిద్ది!" అన్నాడు పేరయ్య.

గొడ్లకి మేతలేదు. తిండిగింజలు లేవు. అవి లేకపోతే రోజు జరగదు. చేతిలో డబ్బు లేదు. ఇస్తానన్న పేరయ్య దగ్గర తీసుకోవడం నయం. అంతకంటే దారిలేదు.

"సరే ఇవ్వు" అన్నాడు సుబ్బయ్య.

'ముందుగానే పేరయ్య డబ్బు జేబులో వుంచుకుని వచ్చాడు. సుబ్బయ్య అడిగిన వెంటనే ఆనందంగా డబ్బు తీసి ఇచ్చాడు.

రామారావు పంతులు నోటు రాసాడు.

'ఇక ఎక్కడికి పోతావురా సుబ్బయ్యా? నీ గొంతు నా చేతిలో చిక్కిందిరా? పొలం అమ్ముపు? నీ పొలాన్ని నా పొలంలో కలుపుకోకపోతే నా పేరు పేరయ్యే కాదు. కాకపోతే రెండు మూడు ఏళ్ళు గడుస్తయ్యేమో! నాకు ఇంత మేలు చేసిన సొసైటీ వాళ్ల ఉపకారం మరచిపోకూడదు! వాళ్ళకి తృణమో పణమో సమర్పించుకుని వాళ్ళ రుణం తీర్చుకోవాలి!" అనుకుంటూ ఆనందంగా ఇంటిదారి పట్టాడు పేరయ్య. ◆

జాతీయాలు

✻ కొండబాబు



"హలో..."

"హలో... హల్లో.... హల్లో...."

"ఎంతకాలానికి" చాలా కాలం తర్వాత కలసిన మిత్రులు సుబ్బారావు, అప్పారావు పలుకరించుకున్నారు.

"మరీ నల్లపూసయ్యావోయ్"

"అవును ఎండలు కదా... నల్లబడ్డాలే" నవ్వాడు అప్పారావు.

"నువ్వేమో మరీ శీత కన్నేశావ్" అప్పారావే అన్నాడు.

"రాముడి కన్ను కంటే సీత కన్నే బాగుంటుందని" తిరిగి చురకేశాడు సుబ్బారావు.

ఇద్దరూ కులాసాగా కబుర్లు చెప్పుకున్నారు.

* * *

'నల్లపూసయ్యావ్' అని ఎవరైనా అంటే దానర్థం నల్లబడటమని కాదు.

శీతకన్ను వేయడమంటే, శీత, ద్రౌపది వంటి పౌరాణిక మహిళా పాత్రల కళ్ల గురించి మాట్లాడటమూ కాదు. ఏంటో తెలుసుకుందాం.

ఏ భాషయినా సమగ్రమయినదా కాదా అనే దానికి ఆ భాషలో ఉద్భవించిన సాహిత్యాన్ని కొలమానంగా చెబుతారు. కానీ సాహిత్య కొలమానమనేది ఒక స్థాయి ప్రజానీకానికే తెలిసి వుండే ప్రామాణికత. దానికి మించి, అందరికీ తెలిసి ఉండే ప్రామాణికత ఆ భాషలో ఏర్పడిన పలుకుబడులు, పలుకుబడుల్లోని వైవిధ్య రూపాలు. పైగా జనసామాన్యం నోళ్లలో నానేవయితే ఇక చెప్పనే అక్కరలేదు. అది సమగ్రమైన భాషే.

ఆ రీత్యా చూసినపుడు మన తెలుగు భాష సమగ్రమైనదనే నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. విభిన్న పలుకుబడులకు, పలుకుబడి రూపాలకు తెలుగులో కొదవ లేదు. అనేక పదాలకు ప్రత్యామ్నాయ పదాలున్నాయి. అనేక అర్థాలనిచ్చే వ్యర్థ పదాలున్నాయి. లెక్కకు మిక్కిలి పలుకుబడి రూపాలూ వున్నాయి. ఇదంతా భాషా సంపదే.

ఇదంతా తెలుగు నుడికారమే. నుడులు, నానుడులు, సామెతలు, జాతీయాలు వంటివన్నీ అవే.

నుడులు, నానుడులు, సామెతల వంటి వాటి గురించి అందరికీ తెలుసు. గతంలో మన శీర్షిక కిందా చర్చించి వున్నాం. 'జాతీయాలు'గా తెలియకపోయినా మన జాతీయాలూ అందరికీ తెలుసు. ఆంగ్లం వంటి అంతర్జాతీయ మాధ్యమిక భాషలో వలెనే తెలుగులోనూ జాతీయాలు లెక్కకు మిక్కిలి. ఆ జాతి భాషలోని తీయదనానికివి అద్దం పడతాయి.

పైన పేర్కొనున్న ఉపోద్ఘాతంలో అప్పారావు, సుబ్బారావు మాటల్లో దొర్లిన నల్లపూస, శీతకన్ను... జాతీయాలే. వాటికి నేరుగా ఉండే అర్థం వేరు. అవి తెలియజేసే అర్థం వేరు. ఉదాహరణకు నల్లపూసను చెప్పుకోవచ్చు. కొంత లిపి తేడా కూడా ఉంటుంది కొన్ని పదాలకు. శృతకన్ను అలాంటిదే.

ఇప్పుటికప్పుడు ఈ రెండు జాతీయాల గురించి మాట్లాడుకోవడం మన ఉద్దేశం కాదుగానీ, మొత్తంగా జాతీయాలు మన భాష పరిపుష్టి కావడంలో ఒక భాగమని చెప్పాల్సి ఉంది.

జాతీయ సంపదలాగే భాషకు 'జాతీయాల సంపద' కూడా అవసరమే. ఇది ఆ భాషా జాతి మొత్తానికి సంపద. జాతీయాలు ఒకటి రెండు పదాలలో విస్తృతార్థాన్ని తెలియజేస్తాయి. ఇందాక చెప్పుకున్నట్లు నేరుగా ఉండే అర్థం అందరికీ తెలిసిందే అయి ఉంటుంది. కానీ అది తెలిపే ప్రత్యేకార్థం లోతయినది. విస్తృతమయినదీనూ.

ధృతరాష్ట్ర కౌగిలి, శ్రీరామవాక్యం లాంటివి మరికొన్ని ఉదాహరణలు. ఇవి కూడా కాలానుగుణంగా కొత్తవి ఉద్భవిస్తూనే ఉంటాయి. తెలుగు భాషలోనూ కొత్త జాతీయాల ఆవిర్భావం ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంది. కుంభకోణం, శఠగోపం, నామాలు.. లాంటివి కొత్తగా వచ్చిన వాటికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

సమగ్రమైన మన భాషలోని విషయాలకు సమగ్రతనిచ్చే జాతీయాల గురించి ఒక క్రమంలో చర్చించుకుందాం. ◆

పాఠక స్పందన

యువ చిత్రకారులకు మార్గదర్శకం

ఏప్రిల్ 20 సంచికలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన చిత్రకళలో రాణిస్తున్న ప్రభాకర్ చిత్రకళకే వన్నె తెచ్చే విధంగా చిత్రాలను చిత్రించడం, చిత్రవర్ణనకే చిత్రాతిచిత్రంగా మారడం మాకెంతోఆనందం కలిగించింది. చిత్రకళా జగతిలో మకుటం లేని మహారాజుగా వెలుగొందుతూ, అభినవ రవివర్మగా కీర్తింపబడడం ప్రభాకర్‌గారి చిత్రకళా నైపుణ్యానికి ఇది ఒక తార్కాణం అనే చెప్పాలి. నేటి మేటి యువవర్ధమాన చిత్రకళాకారులను ప్రభాకర్ మార్గదర్శకుడుగా మారాలి. అలాగే 13వ తేదీ సంచికలో పలుకబడి శీర్షికన ప్రచురించిన హిమలేఖ్యం తెలుగు భాష గురించి, తెలుగు భాషా ప్రావీణ్యం గురించి, దేశ విదేశాలలో తెలుగుకున్న పవర్ గురించి భాషా చరిత్రకు, భాషా ప్రతిభకు అద్దం పట్టే విధంగా తెలుగు భాష గురించి తెలియజేసిన రచయితకు అభినందనాలు.

- మేదూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

కలచివేసిన బతుకుపోరు

ఏప్రిల్ 13వ తేదీ సంచికలో ప్రచురించిన రియల్ స్టోరీ 'బతుకుపోరు' శీర్షికను చదువుతుంటే హృదయం బరువెక్కింది. ఇటువంటి సమస్యలకు పరిష్కార మార్గం లేదా, ప్రజల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని నా మనసు నన్ను ప్రశ్నించింది. పదేపదే ఆలోచింప చేసింది. ప్రజాస్వామ్య దేశంలో కూడా పేద ప్రజలు బతుకుపోరులో నిత్యం ఆకలితో అలమటిస్తున్నారని రచయిత తెలిపారు. భర్త చనిపోయిన లక్ష్మి తన పిల్లల కోసం జీవిత రణరంగంలో ఆమె సంఘర్షణ పడుతుందని తెలిపారు.

- మామిండ్ల రమేష్ రాజా, పాలకుర్తి